సాక్షి
కాకినాడ

శనివారం । 30 । ఆగస్టు । 2025



ఉపకారి కోసం ఉద్యమిద్దాం..

సముద్ర సంరక్షణిగా పేరుగాంచిన చేప బొక్కు సొర క్రమంగా కనుమరుగవుతోంది. సుమారు 65 కోట్ల సంవత్సరాల నుంచి ఉన్న ఈ చేప శక్తివంతమైన సాధుజీవి.

8లో



బరువులెత్తారు...పతకాలు పట్టారు

అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ ప్రాంగణంలో 4వ యునైటెడ్ ఈస్ట్ అండ్ వెస్ట్ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీలు శుక్రవారం ఉదయం ప్రారంభమయ్యాయి.

8లో

అంతర్జాతీయ సమావేశాలకు నిర్కా డైరెక్టర్ మాగంటి



ఐసీఏఆర్ - జాతీయ వాణిజ్య పరిశోధన సంస్థ (నిర్కా) డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషమాధవ్ స్వీడన్ స్టాక్‌హోమ్‌లో పొగాకు ఉత్పత్తులపై జరిగే సమావేశానికి హాజరుకానున్నారు. సెప్టెంబర్ 2 నుంచి 5 తేదీ వరకు వీటిని నిర్వహిస్తారు.

న్యూస్‌రీల్

నర్సింగ్ పరీక్షల్లో కాపీయింగ్ ఆరోపణలపై విచారణ

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో జీఎన్‌ఎం సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణలో చోటు చేసుకున్న కాపీయింగ్ ఆరోపణలపై శుక్రవారం విచారణ జరిగింది. డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ఆదేశాల మేరకు త్రిసభ్య కమిటీ ఏర్పాటైంది. ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ శశి సహా ఆర్‌ఎంసీ నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉమాసుందరి ఆధ్వర్యంలో ఆర్‌ఎంసీ డైనింగ్ ప్రాంగణంలో విచారణ జరిగింది. జీఎన్‌ఎం సప్లిమెంటరీ పరీక్షల్లో కాపీయింగ్ చోటు చేసుకుందా, చేసుకుంటే కారణాలేమిటి, అందుకు తగ్గ ఆధారాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో విచారించారు. 29 మంది ఇన్విజిలేటర్లతో పాటు జీఎన్‌ఎం నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్, సంబంధిత సీటు గుమస్తా, సీనియర్ అసిస్టెంట్ ఏసుబాబును విచారించారు. విచారణ అనంతరం నివేదికను డీఎంఈకి పంపారు.

పొగాకు నారుమడికి రిజిస్ట్రేషన్ తప్పనిసరి

– బోర్డు అధికారి హేమస్మిత



పల్లంట్లలో పొగాకు నారుమడులను పరిశీలిస్తున్న అధికారుల బృందం

దేవరపల్లి: పొగాకు నారుమడులు కట్టే ముందు రైతులు తప్పనిసరిగా బోర్డులో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి సీహెచ్ హేమస్మిత రైతులకు సూచించారు. రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని ఐదు పొగాకు వేలం కేంద్రాల పరిధిలో కట్టిన పొగాకు నారుమడులను పరిశీలించి, రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వడానికి ఈ ఏడాది పొగాకు బోర్డు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. బోర్డు క్షేత్రస్థాయి అధికారి కీర్తికుమార్ ఆధ్వర్యంలో బృందం పనిచేస్తుందన్నారు. నారుమడులను పరిశీలించి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను తనిఖీ చేస్తారని ఆమె చెప్పారు. బృందం శుక్రవారం దేవరపల్లి వేలం కేంద్రం పరిధిలోని పల్లంట్లలో యలమాటి సుధాకర్ పొగాకు నర్సరీలను తనిఖీ చేసినట్టు ఆమె చెప్పారు. రిజిస్ట్రేషన్ లేకుండా నారుమడులు కడితే చర్యలు తీసుకొంటామన్నారు. రిజిస్ట్రేషన్ గల నారుమడుల్లోనే రైతులు నారు కొనుగోలు చేయాలని, నారు కొనుగోలు చేసిన నారుమడి రైతు ఇచ్చిన రశీదును నాట్లు వేసే సమయంలో మొక్కపారంతో పాటు జత చేసి వేలం కేంద్రంలో అందజేయాలన్నారు. రిజిస్ట్రేషన్ లేని నారుమడుల నుంచి నారు కొనుగోలు చేస్తే పొగాకు బ్యారన్ రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని తెలిపారు. 2025–26 పంట కాలానికి రాష్ట్రంలో 142 మిలియన్ల పొగాకు ఉత్పత్తికి అనుమతి ఇచ్చిందన్నారు.వేలం కేంద్రం పరిధిలో ఇప్పటి వరకు 96 మంది రైతులు నారుమడులను రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టు తెలిపారు. వీరంతా నారు వ్యాపారస్తులేనని చెప్పారు.

గోదావరి పరవళ్లు

కాటన్ బ్యారేజీ నుంచి 7.88 లక్షల క్యూసెక్కుల మిగులు జలాల విడుదల



కాటన్ బ్యారేజీ వద్ద ఉధృతంగా ప్రహిస్తున్న గోదావరి

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతోంది. శుక్రవారం మధ్యాహ్నం 10.30 అడుగులకు నీటి మట్టం చేరింది. బ్యారేజ్ నుంచి 7,88,938 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. అనంతరం స్వల్పంగా తగ్గి రాత్రి 10 అడుగులకు చేరింది. ఎగువ ప్రాజెక్టుల నుంచి ముందుగా ప్రకటించిన విధంగా నీటిని దిగువకు విడుదల చేయకపోవడంతో కాటన్ బ్యారేజీ వద్ద ప్రమాద స్థాయికి నీటి మట్టం చేరలేదు. అయితే శుక్రవారం రాత్రి ఎగువ ప్రాంతాల్లో నీటి మట్టాలు క్రమేపి పెరుగుతుండటంతో శనివారం ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద నీటి ఉధృతి పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. గోదావరి డెల్టా కాలువలకు 6,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,500, మధ్య డెల్టాకు 700, పశ్చిమ డెల్టాకు 2,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఎగువ ప్రాంతాలకు సంబంధించి కాళేశ్వరంలో 12.33 మీటర్లు, పేరూరులో 16.65 మీటర్లు, దుమ్ముగూడెంలో 11.63 మీటర్లు, భద్రాచలంలో 42.90 అడుగులు, కూనవరంలో 17.01 మీటర్లు, కుంటలో 9.85 మీటర్లు, పోలవరంలో 11.31 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 15.40 మీటర్లు నీటి మట్టాలు కొనసాగుతున్నాయి.

ఆటోవాలా లబోదిబో

- ఏకపక్షంగా మహిళలకు ఫ్రీ బస్సు పథకం
- ఆటో కార్మికుల ఉపాధికి గండి
- దిక్కుతోచని స్థితిలో 23 వేల కుటుంబాలు
- చేసిన అప్పులు తీర్చేదెలా అంటూ ఆందోళన
- రూ.15 వేల ఊసెత్తని సర్కారు
- కనీస కనికరం చూపని వైనం





పెద్దాపురంలో ఆటో కార్మికుల నిరసన ర్యాలీ

సాక్షి ప్రతినిధి, కాకినాడ: రోజంతా కష్టపడి ఆటో నడుపుతూ పొట్టపోసుకుంటోన్న వేలాది కుటుంబాలను ముఖ్యమంత్రి చంద్రబాబు రోడ్డున పడేశారు. ఆటో నడిస్తేనే జీవన చక్రం తిరిగే కుటుంబాలు నేడు దిక్కులు చూస్తున్నాయి. ప్రయాణికులు రాక, కిరాయిలు లేక రోజు గడవక ఆటోవాలాలు నానా పాట్లు పడుతున్నారు. పూట గడవడమే గగనమైపోతోందని లబోదిబోమంటున్నారు. ఒకప్పుడు ఆడుతూ, పాడుతూ సాగిపోయిన కుటుంబాలు కాస్తా కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన ఫ్రీ బస్సు పథకంతో అష్టకష్టాల పాలవుతున్నాయి. ఒకరు, ఇద్దరు కాదు ఏకంగా 25వేల మంది ఆటో కార్మికుల కుటుంబాలకు దిక్కుమొక్కూ లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించి తమ నోటికాడ కూడు లాగేసిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు సర్కార్ నిర్ణయంతో రోడ్డున పడ్డ ఆటోడ్రైవర్లు ఆందోళనలకు శ్రీకారం చుట్టారు.

నిమ్మకు నీరెత్తినట్టుగా...

అధిక వడ్డీలకు అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసి ఇప్పుడు కిరాయిలు లేక నెలవారీ ఈఎంఐలు చెల్లించలేక ఆటో కార్మికులు సతమతమవుతున్నారు. ఆర్టీసీలో ప్రవేశపెట్టిన మహిళలకు ఫ్రీ బస్సు పథకంతో ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డామని గడచిన ఆరేడు నెలలుగా మొత్తుకుంటున్నా ప్రభుత్వానికి కనీసం కనికరం లేదంటున్నారు. రోజుకు 10 నుంచి 15 ట్రిప్పులు వేస్తూ ఈఎంఐ చెల్లించేయగా రూ.1,000 రూ.1,200 ఇంటికి తీసుకువెళ్లే ఆటో కార్మికులకు ఫ్రీ బస్సు వచ్చిన దగ్గర నుంచి రూ.అయిదారు వందలు కూడా చేతికి రావడం లేదంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబాలను పోషించుకోవడం ఎలా అని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఉచిత బస్సుతో జీవనోపాధి కోల్పోతామని తెలిసినా కనీసం సంప్రదించకుండా ఏకపక్షంగా సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని ఆటో యూనియన్‌లు తప్పుపడుతున్నాయి. ఎన్నికల వేళ కూటమి నేతలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం హామీ ఇచ్చిన రోజు నుంచి తమకు జరుగుతోన్న అన్యాయంపై వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నా సర్కార్ నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పోరుబాట

ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించకపోతుందా అనే ఆశతో జిల్లాలోని జగ్గంపేట, గోకవరం, పెద్దాపురం, కాకినాడ తదితర ప్రాంతాల్లో ఆటో కార్మికులు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. తాజాగా శుక్రవారం పెద్దాపురం పట్టణంలో ఆటో కార్మికులు దర్గా సెంటర్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు నిరసన ర్యాలీతో ప్రభుత్వంపై తిరుగుబాటు బావుటా ఎగరేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాదిరిగా చంద్రబాబు ఇస్తామన్న రూ.15,000 ఆర్థికసాయం అందించి భరోసా కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

అక్కున చేర్చుకున్న జగన్ సర్కార్

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆటో కార్మికుల సంక్షేమానికి పెద్ద పీట వేసింది. ఆటో కార్మికులకు వాహన మిత్ర పథకం ప్రవేశపెట్టి వారి ఉపాధికి భరోసాగా నిలిచింది. ఆటో ఉన్న ప్రతి కార్మికుడికి ఏటా రూ.10 వేలు వాహన మిత్ర పథకం ద్వారా ఆర్థిక సహాయం చేసి ఆదుకుంది. కోవిడ్ లాంటి కష్టకాలంలోనూ ఈ పథకం ద్వారా క్రమం తప్పకుండా సాయం అందించి ఆటో కార్మికులను ఆదుకుంది. వారి కుటుంబాల్లో చిరునవ్వులు చిందించేలా తోడ్పాటు అందించింది.

ఆ కుటుంబాల జీవనం ఎలా?

కాకినాడ జిల్లాలో సుమారు 20 వేల మంది ఆటోలు నడుస్తున్నాయి. తగిన విద్యార్హత ఉన్నా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు లేక విద్యావంతులు కూడా ఫైనాన్స్‌పై ఆటోలు తీసుకుని నడుపుతూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. తగిన స్థోమత లేకపోయినా ఫైనాన్స్‌లో ఆటో తీసుకొని నెలనెలా ఇఎంఐలు చెల్లిస్తూ వస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణంతో ఇఎంఐలు చెల్లించడమే కష్టమైపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు ఆటోలు ఎక్కడం లేదు. జిల్లాలోని కాకినాడ నగరంతో పాటు తుని, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట పట్టణాలతో పాటు జగ్గంపేట, గోకవరం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, కరప, గొల్లప్రోలు, ఉప్పాడ కొత్తపల్లి, తొండంగి, కోటనందూరు తదితర మండల కేంద్రాలల్లో సైతం ఆటోలే జీవనాధారంగా వేలాది కుటుంబాలు ఉన్నాయి. ఈ కుటుంబాలన్నీ ఫ్రీ బస్సు పథకంతో ఇప్పుడు ఏమి చేయాలో తెలియని అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

ఆదాయం పడిపోయింది



నా పేరు సుబ్రహ్మణ్యం. మాది పెద్దాపురం మండలం తిరుపతి గ్రామం. నేను ఐదేళ్లుగా ఆటో ఆధారంగా బతుకుతున్నాను. నాకు, భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. నేను గతం వరకు ప్రతి రోజు పిఠాపురం- దివిలి, సామర్లకోట-దివిలి మధ్య 10 ట్రిప్ లు తిరిగితే రూ.1,500 వచ్చేవి. రూ.500 ఆయిల్‌కి పోగా రూ.1,000 వస్తే నెలకు రూ.10వేలు ఆటో వాయిదా చెల్లించి మిగిలిన డబ్బులతో జీవనం సాగించేవాళ్లం. ప్రస్తుత ప్రభుత్వం ఫ్రీ బస్సు పెట్టాక కనీసం ఐదు ట్రిప్‌లు కూడా వెయ్యలేని పరిస్థితి. మా బతుకులు అప్పుల పాలై వడ్డీలు చెల్లించలేకపోతున్నాం. ప్రభుత్వం దృష్టి సారించి ఆదుకోవాలి.

– సుబ్రహ్మణ్యం, తిరుపతి, పెద్దాపురం

అప్పులు తీర్చలేకపోతున్నాం



మహిళలకు ఉచిత బస్సు పథకం మా పొట్టకొడుతోంది. ఈ విషయంలో చాలా ఆందోళనగా ఉన్నాం. ఆటోలు ఎక్కే ప్రయాణికుల సంఖ్య సగానికి సగం తగ్గిపోయింది. ట్రిప్పులు లేక ఆదాయం లేక కుటుంబాలను ఎలా పోషించుకోవాలో అర్థం కావడం లేదు. మాకు ప్రత్యామ్నాయ ఉపాధి లేదా మరి ఏదైనా ఆదాయ మార్గాన్ని చూపించాలని కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాం.

– తుమ్మల గంగాధర్, ఆటో ఓనర్ కం డ్రైవర్

ఒక ట్రిప్పు వేయడమే గగనమైపోతోంది



నా పేరు ఆళ్ల గంగాధర్. నేను ఆటో డ్రైవర్‌ని. తుని-కోటనందూరు మధ్య ఆటో నడుపుతాను. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేసినప్పటి నుంచి ఆటోలకు డిమాండ్ తగ్గిపోయింది. గతంలో రోజూ మూడు ట్రిప్పులు వేసి వెయ్యి రూపాయల వరకూ సంపాదించే వాడిని. ఇప్పుడు రోజూ ఒక ట్రిప్పు వేయడమే కష్టంగా మారింది. రోజూ రూ.500 కూడా సంపాదించలేకపోతున్నాను. ఆటోకు నెలవారీ ఇఎంఐలు కట్టడం, కుటుంబం గడవడం కష్టంగా మారింది. ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి.

– ఆళ్ల గంగాధర్, ఆటోడ్రైవర్, కోటనందూరు

కెనరా బ్యాంకు కార్యకలాపాల అడ్డగింపు



తేటగుంట కెనరా బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

– గోల్డ్‌లోన్ బాధితుల ధర్నా

తుని రూరల్: తాకట్టు పెట్టిన తమ బంగారు ఆభరణాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గోల్డ్‌లోన్ బాధితులు తేటగుంట కెనరా బ్యాంకు ఎదుట ఆందోళన చేశారు. శుక్రవారం బాధిత మహిళలు, పురుషులు పెద్ద సంఖ్యలో బ్యాంకు గేటు వద్ద షామియానా వేసి ధర్నా నిర్వహించి, ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ దశాబ్దంగా బ్యాంకులో ఆభరణాలు తాకట్టు పెట్టి రుణాలు పొందుతున్నామని, తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలను జనవరి నెలలో విడిపించుకునేందుకు రాగా నగలు మాయమయ్యాయన్నారు. దీనిపై నిలదీస్తే ఆభరణాలు తారుమారయ్యాయని, కొన్ని నగలు గోల్‌మాల్ అయినట్టు బ్యాంకు అధికారులు పేర్కొన్నట్టు బాధితులు తెలిపారు. ఆ తర్వాత అప్రైజర్ మోసం చేశాడని, మేనేజరుతో సహ మరో ఇద్దరిని ఉన్నత అధికారులు సస్పెండ్ చేశారన్నారు. రుణగ్రస్తులందరికీ బంగారాన్ని ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇస్తానన్న ఆభరణాలు ఇవ్వకపోవడంతో ఫిబ్రవరి నెలలో ఆందోళన వ్యక్తం చేయగా నెలరోజుల్లో నగలు లేదా నగదు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అప్పటి నుంచి తిరుగుతున్నా తమ ఆభరణాలు ఇవ్వలేదని వాపోయారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నగలు ఇవ్వకుండానే గోల్డ్‌లోన్‌దారులతో డబ్బు కట్టించుకున్నారు. దీంతో నగలతో పాటు నగదు నష్టపోయామని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి బాధితులు బ్యాంకు వద్దే ధర్నా చేయడంతో బ్యాంక్ తలుపులు తెరవలేదు. ఉన్నత అధికారులకు గోల్డ్‌లోన్ బాధితుల ఆందోళన విషయాన్ని తెలియజేసినట్టు సిబ్బంది పేర్కొన్నారు.

ప్రతి మహిళా పారిశ్రామిక వేత్తగా ఎదగాలి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ప్రతి మహిళా వ్యాపారవేత్తగా, పారిశ్రామిక వేత్తగా ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ కోరారు. శుక్రవారం కాకినాడ స్థానిక స్మార్ట్ సిటీ సమావేశ హాలులో ఐసీడీఎస్ విభాగం మహిళల సంక్షేమం, భద్రత, హక్కులు అంశాలపై నిర్వహించిన జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళల భద్రత, రక్షణ కేవలం ప్రభుత్వం, పోలీసుల బాధ్యత కాదని సమాజంలో ప్రతీ ఒక్కరూ ఈ బాధ్యత స్వీకరించేందుకు ముందుకు రావాలని కోరారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా ప్రతి చోటా, వేసవి సెలవుల్లో కూడా కిశోర వికాశం వంటి కార్యక్రమాల ద్వారా గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో, పోస్ తదితర చట్టాల గురించి బాలికలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ

యూరియా కోసం పడిగాపులు



మల్లేపల్లి సొసైటీ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

గండేపల్లి: కొంతకాలం నుంచి యూరియాకు కృత్రిమ కొరత ఏర్పడటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సొసైటీలకు యూరియా వచ్చిందనే తెలిసిన తక్షణమే రైతులు పరుగులు తీస్తున్నప్పటికి పూర్తిస్థాయిలో యూరియా దక్కకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. మండలంలోని మల్లేపల్లి సొసైటీలో యూరియా ఉందని సమాచారం తెలుసుకున్న రైతులు శుక్రవారం సొసైటీ వద్ద బారులు తీరారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పడిగాపులు కాసారు. కొందరు రైతులకు పూర్తిస్థాయిలో యూరియా అందకపోవడంతో సిబ్బంది ఇచ్చిన ఒక్క బస్తాను తీసుకుపోయారు. మల్లేపల్లి, కె గోపాలపురం గ్రామాల రైతులు ఈ సొసైటీ నుంచే ఎరువులు తీసుకెళతారు. అయితే సొసైటీలో 225 యూరియా బస్తాలు స్టాక్ ఉన్నప్పటికి 113 మంది రైతులకు మాత్రమే సిబ్బంది అందజేశారు. ఆధార్, పాస్‌బుక్ జిరాక్స్ తెచ్చుకున్న రైతులకు ఒక్క బస్తా మాత్రమే ఇస్తామని సొసైటీ సిబ్బంది చెప్పడంతో రైతులు ఆవేదనకు గురయ్యారు. ఒక దశలో వీరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కె గోపాలపురం రైతు కర్రి రామకృష్ణ పొలం జగ్గంపేట మండలంలో మల్లిశాలలో ఉండటంతో శుక్రవారం మల్లేపల్లి సొసైటీకి యూరియా కోసం వచ్చాడు. అయితే అతనికి యూరియా ఇచ్చేది లేదని సిబ్బంది చెప్పడంతో రైతు వాపోయాడు. మల్లేపల్లి సొసైటీలోనే గతంలోను ఎరువులు తీసుకువెళ్లానని ఇప్పుడు ఇలా మాట్లాడుతున్నారని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. యూరియా పంపిణీపై రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సొసైటీ సిబ్బంది తమకు కావాల్సినవాళ్లకే ఇచ్చారని ఆరోపిస్తున్నారు. సొసైటీలో 225 బస్తాల యూరియా స్టాక్‌ను కేవలం 113 మంది రైతులకు పంచయేడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దయనీయ బాల్యంపై వాత్సల్యం

- మిషన్ వాత్సల్య స్పాన్సర్ షిప్ పథకంతో ఆర్థిక సాయం
- బాలల భవిత, భద్రత, ఆరోగ్యం కోసం
- అనాథలు, దీన బాలలు అర్హులు
- కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహణ
- దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం
- అవగాహన లోపంతో దరఖాస్తు చేసుకోని వైనం



మిషన్ వాత్సల్య స్పాన్సర్ షిప్ సమావేశంలో మాట్లాడుతున్న కాకినాడ రూరల్ సీడీపీవో లక్ష్మి. చిత్రంలో డీపీపీవో వెంకట్, పీవో ఎన్ఐసీ విజయ

కాకినాడ క్రైం: దయనీయ బాల్యంపై వాత్సల్యం కురిసింది. మిషన్ వాత్సల్య స్పాన్సర్ షిప్ పథకం దయనీయ స్థితిలో ఉన్న నిస్సహాయ బాలలకు చేయూతనిస్తోంది. వారిని బాధ్యతగా చూసుకుంటున్నవారికి తన వంతు సాయమందిస్తోంది. జిల్లాలో ప్రతి ఏటా వందలాది మంది బాలలు ఈ ప్రయోజనాన్ని అందిపుచ్చుకోవడానికి అవకాశం ఉన్నా, అవగాహన లేక పథక ప్రయోజనాన్ని పొందలేకపోతున్నారు.

ఏంటీ పథకం...

మిషన్ వాత్సల్య స్పాన్సర్ షిప్ పథకం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షణలో జిల్లా శాఖ ఆధ్వర్యంలో అనుబంధ జిల్లా బాలల పరిరక్షణ విభాగం (డీసీపీయూ) అర్హులైన బాలలకు ఈ పథక ప్రయోజనాలను అందిస్తోంది. బాలల భవిత, భద్రత, ఆరోగ్యంతో పాటు కుటుంబ అనుబంధాలన్నీ ఆస్వాదించే లక్ష్యంతో ఈ పథకాన్ని రూపొందించి అమలు చేస్తున్నారు. తమ వారికి దూరం చేయకుండా అక్కడే ఉంచి సాయం అందిస్తున్నారు. బాలల పోషణ చూస్తున్న సహాయకులు, సంరక్షకులకు సాయమందిస్తూ బాలల ఉన్నతికి తోడ్పాటునివ్వడమే ఈ పథక ఉద్దేశం.

కలెక్టర్ చైర్‌పర్సన్‌గా కమిటీ

అర్హులైన బాలల్ని ఎంపిక చేసేందుకు ప్రత్యేక కమిటీ ఉంది. ఈ కమిటీని స్పాన్సర్‌షిప్ అండ్ ఫోస్టర్ కేర్ అప్రూవల్ కమిటీ (ఎస్ఎఫ్‌సీఏ) అంటారు. కలెక్టర్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో ఎక్స్ అఫీషియో మెంబర్‌గా మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ, మెంబర్లుగా సీడబ్ల్యూసీ(చైల్డ్ వెల్ఫేర్ కమిటీ) మెంబర్ లేదా చైర్‌పర్సన్, బాలల సంరక్షణ కోసం పనిచేసే ఎన్‌జీవో ప్రతినిధి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి(డీసీపీవో), జిల్లా బాలల పరిరక్షణాధికారి(పీవో ఎన్ఐసీ), శిశుగృహ మేనేజర్ మెంబర్లుగా ఉంటారు. అర్హులైన బాలల్ని ఎంపిక చేయడంలో వీరిదే తుది నిర్ణయం.

అర్హులెవరు

తొలి ప్రాధాన్యత తల్లి, తండ్రిని కోల్పోయిన పూర్తి స్థాయి అనాథలకు ఇస్తారు. కోవిడ్ వేళ తల్లిదండ్రులు ఇద్దర్నీ కోల్పోయిన పిల్లలు, హెచ్ఐవీ బారిన పడిన బాలలు, తల్లిదండ్రులకు హెచ్ఐవీ సహా ఇతర దీర్ఘకాలిక వ్యాధులున్న పిల్లలు, పోక్సో బాధిత బాలలు, పాక్షిక అనాథలు, రక్షణ, సంరక్షణ అవసరం ఉన్న పిల్లలు స్పాన్సర్ షిప్ పథక ప్రయోజనాన్ని పొందేందుకు అర్హులు. కేవలం మైనర్లకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది.

ప్రతి నెలా రూ.4 వేలు

స్పాన్సర్ షిప్ పథకం ద్వారా అర్హులైన పిల్లలకు ప్రతి నెల రూ.4 వేల చొప్పున పిల్లల ఖాతాలు లేదా వారి సంరక్షకులతో ఉమ్మడిగా ఉన్న జాయింట్ ఖాతాలలో కేంద్ర ప్రభుత్వం డబ్బు జమ చేస్తుంది. ఈ మొత్తాన్ని వారి సంరక్షకులు... పిల్లల చదువు, ఆరోగ్యం అవసరాలకు, పిల్లల రోజు వారీ అవసరాల నిర్వహణకు తప్ప మరే రకంగానూ వెచ్చించకూడదు. అంగన్‌వాడీ వర్కర్లు, గ్రామ మహిళా పోలీసుల ద్వారా ఇటువంటి పిల్లల్ని గుర్తిస్తారు. బాలల వాస్తవ స్థితిని స్వయంగా ఇంటికి వెళ్లి నిర్ధారిస్తారు. సంరక్షకులు లేదా తల్లి లేదా తండ్రి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ దరఖాస్తులను అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సీడీపీవోలకు అందిస్తారు. వీటిని నిర్ధారించి సీడీపీవోలు డీసీపీయూ విభాగానికి పంపిస్తారు. ఈ యావత్ ప్రక్రియ ఐసీడీఎస్ పీడీ ఆధ్వర్యంలో జరుగుతుంది. దరఖాస్తు చేసుకోవడం అంతా ఆఫ్‌లైన్ విధానంలోనే.

కావలసిన ధ్రువీకరణలు

బాలుడు లేదా బాలిక జనన ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, గ్రామాల్లో నివసిస్తే ఆదాయం ఏడాదికి రూ.72 వేలకు మించకూడదు. అర్బన్ అయితే రూ.96 వేల లోపు వార్షిక ఆదాయం ఉండాలి. బాలుడు లేదా బాలిక ఆధార్ కార్డు, తల్లిదండ్రులు ఇద్దరూ లేదా వారిలో ఒక్కరు మరణించినట్లయితే సంబంధిత మరణ ధ్రువీకరణ పత్రాలు, బాలలు లేదా తల్లిదండ్రులకు దీర్ఘకాలిక వ్యాధులు ఉంటే ఆ రిపోర్టులు, పోక్సో బాధితులు అయితే కేసు పత్రాలు, బాలుడు లేదా సంరక్షకులతో కూడిన జాయింట్ అకౌంట్ వివరాలు, సంరక్షకులు మాత్రమే ఉంటే వారి ఆధార్ కార్డు, వారి ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి.కాకినాడ జిల్లాలో గడచిన మూడేళ్లలో మొత్తం 1,626 మంది బాలలకు మిషన్ వాత్సల్య స్పాన్సర్ షిప్ పథకం ద్వారా ప్రయోజనం అందింది. 2022–23 ఏడాదిలో 683 మంది, 2023–24లో 440 మంది, 2024–25 లో 503 మంది దీన బాలలకు నెలకు రూ.4 వేలు చొప్పున సహకారం అందింది.

18 ఏళ్లు నిండే వరకు



స్పాన్సర్ షిప్ పథకం జిల్లాలో డీసీపీ యూనిట్ పరిధిలో డీసీపీవో వెంకట్ పర్యవేక్షణలో పీవో ఎన్ఐసీ కె.విజయ ఆధ్వర్యంలో అమలవుతోంది. బాలలు ఏ వయసులో దరఖాస్తు చేసుకున్నా వారికి 18 ఏళ్లు నిండే వరకు స్పాన్సర్ షిప్ ప్రయోజనం అందుతుంది. బాలలు కచ్చితంగా చదువుతుండాలి. హాస్టళ్లలో ఉంటే వర్తించదు. సింగిల్ పేరెంట్, అనాథ బాలలు, వ్యాధిగ్రస్త బాలలు, వ్యాధి ప్రభావిత పిల్లల్ని ఎవరినైనా చేరదీస్తే వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తను సంప్రదించాలి. కుటుంబ జీవితానికి పిల్లల్ని దూరం చేయకుండా వారి భవితకు భరోసా కల్పించడమే ఈ పథకం లక్ష్యం.

– చెరుకూరి లక్ష్మి, పీడీ, ఐసీడీఎస్

క్లుప్తంగా

రేపు దివ్యాంగుల క్రికెట్ జట్టు ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): స్థానిక రంగరాయ వైద్య కళాశాలలో సెప్టెంబరు 12 నుంచి 14 వరకు జరిగే దివ్యాంగుల స్వర్ణాంధ్ర ఇంక్లూసివ్ క్రికెట్‌కప్ 2025లో పాల్గొనే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా దివ్యాంగుల క్రికెట్ జట్టు ఎంపిక ఆదివారం ఆర్‌ఎంసీ మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఏసీఏ దివ్యాంగుల క్రికెట్ కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఈ టోర్నీలో శ్రీకాకుళం, విశాఖ, విజయనగరం, తూర్పు గోదావరి జట్లు పాల్గొంటాయన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 31 ఉదయం 8 గంటలకు ఎంపికలు జరిగే మైదానానికి రావాలని, వివరాలకు 84988 77877 నంబరులో సంప్రదించాలని కోరారు.

మహిళను మోసగించిన కేసులో 11 ఏళ్ల జైలు

పెదపూడి: వివాహం చేసుకుంటానని నమ్మించి, మహిళను మోసగించిన కేసులో ఒక వ్యక్తికి కాకినాడ 8వ ఏడీజే కోర్టు న్యాయమూర్తి 11 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించినట్లు పెదపూడి ఎస్సై ఎస్.తులసీరామ్ తెలిపారు. ఆయన శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం బిక్కవోలు మండలం తొస్సిపూడి గ్రామానికి చెందిన మహిళ జి.మామిడాడ గ్రామంలోని ఒక ప్రయివేటు కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. అదే కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్న యెలుబండి కళ్యాణ్‌కుమార్ ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, వివాహానికి నిరాకరించి మోసం చేశాడు. దీనిపై గత ఏడాది మార్చి 14న అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. ఈ కేసును కాకినాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్ దర్యాప్తు చేయగా ఏపీపీ కె.రాధాకృష్ణంరాజు సాక్షులను విచారించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	29,000
గటగట (వెయ్యి)	27,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	28,000
గటగట (వెయ్యి)	26,000
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

ఉపకారి కోసం ఉద్యమిద్దాం..

- సముద్ర సంరక్షణికి ప్రాణ సంకటం
- అవగాహన లేమితో వేటాడుతున్న మత్స్యకారులు
- భారీ జలచరమే అయినా సాధుజీవి
- కోస్తా తీరం ప్రత్యుత్పత్తికి అనుకూలం
- వాటి సంరక్షణ మనిషి బాధ్యత
- నేడు ప్రపంచ బొక్కుసార దినోత్సవం

తాళ్లరేవు: సముద్ర సంరక్షణిగా పేరుగాంచిన అతి పెద్ద చేప బొక్కు సార (రింకోడాన్ టైపస్) క్రమక్రమంగా కనుమరుగవుతోంది. సుమారు 65 కోట్ల సంవత్సరాల నుంచి ఉన్న ఈ చేప అత్యంత శక్తివంతమైన సాధుజీవి. సముద్ర తీరం వెంబడి అభివృద్ధి చెందుతున్న ఏడు సెక్టార్ల కారణంగా ఈ గంభీరమైన చేప అంతరించిపోతుండడం అందరినీ కలవరపెడుతోంది. దీని పరిరక్షణకు భారత ప్రభుత్వంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు ఎంతో కృషి చేస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా వందకు పైగా దేశాలలో విస్తరించి ఉన్న ఈ చేపను కాపాడడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమైన నేపథ్యంలో ఏటా ఆగస్టు 30వ తేదీన బొక్కుసార దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఎక్కువ మందమైన చర్మం కలిగిన ఈ చేప సుమారు 13 మీటర్లు (42 అడుగులు) పొడవు ఉండి, 20 నుంచి 25 మెట్రిక్ టన్నులకుపైగా బరువు పెరుగుతోంది. సముద్రంలో హానికర జలాలను తీసుకుని శుభ్రం చేయడంతో పాటు ఆరోగ్యకర వాతావరణాన్ని కలుగజేస్తుంది. దీనికి ఉన్న ప్రత్యేకమైన మొప్పల ద్వారా నీటిలో ఉన్న చిన్న చిన్న చేపలను, జీవులను వడకట్టి తింటాయి. సముద్రంలో 1500 మీటర్ల లోతుకు వెళ్లగలిగే ఈ చేప సుమారు వెయ్యి కిలోమీటర్ల నుంచి 13 వేల కిలోమీటర్ల వరకు వలస వెళ్తుందని అధ్యయనాలు చెపుతున్నాయి. కోస్తాతీర ప్రాంతం ప్రత్యుత్పత్తికి అనుకూలంగా ఉండడంతో మన ప్రాంతానికి ఈ చేపలు వస్తుంటాయి. ఒక చేప 300 పిల్లలకు జన్మనిస్తుందని, వందకంటే ఎక్కువ సంవత్సరాలు జీవిస్తుందని అంచనా. ఈ చేపల వల్ల మానవాళికి ఎటువంటి హాని ఉండకపోవడం విశేషం. బొక్కుసార వాటి రెక్కలు అంతర్జాతీయ మార్కెట్‌లో అత్యంత విలువైనవి కావడంతో వీటి వ్యాపారం ఎక్కువగా సాగుతుంది. మత్స్యకారులకు సరైన అవగాహన లేక వీటిని పట్టుకోవడం వల్ల వీటి సంఖ్య ప్రపంచ వ్యాప్తంగా తగ్గిపోతోంది. అంతే కాకుండా తీరం వెంబడి విస్తరిస్తున్న ఆయిల్ అండ్ గ్యాస్ ఇండస్ట్రీస్, టూరిజం, పోర్ట్ అండ్ షిప్పింగ్, ఉప్పు మడులు, ఫెర్టిలైజర్స్, ఆక్వా కల్చర్, మత్స్య పరిశ్రమల కారణంగా తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో 1978లో వైల్డ్ లైఫ్ సాంక్చురీలను ఏర్పాటు చేసి వన్యప్రాణులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. దీనిలో భాగంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

వాటిని వేటాడితే ఏడేళ్ల జైలు

బొక్కుసార సంరక్షణలో భాగంగా భారీ నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నారు. భారతదేశంలో బొక్కుసార చేపలను పెద్ద పులలతో సమానంగా రక్షిస్తున్నారు. అక్రమంగా బొక్కుసారను చంపినా, వాటి శరీర భాగాలను వ్యాపారం చేసినా 1972 వన్య సంరక్షణ చట్టం కింద ఏడేళ్ల జైలు శిక్ష, అధిక మొత్తంలో జరిమానా విధిస్తున్నారు.

చేపను కాపాడుదాం ఇలా...

సముద్రంలో ఉన్న ఈ గంభీరమైన చేపను సంరక్షించేందుకు అటవీశాఖ వన్యప్రాణి విభాగం పలు సూచనలు చేస్తోంది. చేపల వేటకు వెళ్లినపుడు మత్స్యకారులు సాధు స్వభావం గల బొక్కుసారను పట్టడం లేదా వాటికి హానికలిగించడం చేయరాదని అవగాహన కలిగిస్తున్నారు. తూర్పుతీరం వెంబడి బొక్కుసార తరచుగా వచ్చే ప్రదేశాలను మత్స్యకారులు, రక్షణాధికారులు అటవీశాఖ వారికి తెలియజేసి సంరక్షించాలని కోరుతున్నారు.



గ్రామాల్లో అవగాహన సదస్సులు

పర్యావరణ పరిరక్షణకు, జీవ వైవిధ్యానికి ఎంతగానో సహకరించే అతిపెద్ద చేప మనుగడ కోసం అటవీశాఖ అవగాహనా సదస్సులు నిర్వహిస్తోంది. ప్రధానంగా మత్స్యకార గ్రామాలతో పాటు, జాలర్లు అధికంగా ఉండే ప్రాంతాలు, మార్కెట్ల వద్ద ప్రజలకు అటవీ సిబ్బంది చేప నమూనాలతో పాటు పోస్టర్లతో అవగాహన కల్పిస్తున్నారు.

సంరక్షణకు చర్యలు చేపడుతున్నాం



సముద్ర జలాలను శుభ్రపరచడంలో కీలక పాత్ర పోషించే బొక్కు సారల సంరక్షణకు అన్ని చర్యలూ చేపడుతున్నాం. ప్రధానంగా ప్రపంచ బొక్కు సార దినోత్సవం సందర్భంగా మత్స్యకారులు బోటు యజమానులకు విద్యార్థిని, విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. ఈ మేరకు శనివారం ఉదయం 10 గంటలకు కాకినాడ ఎస్ఐఎఫ్టి (స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ)లో అవగాహన సదస్సు ఏర్పాటు చేశాం. అలాగే వారోత్సవాలు నిర్వహించి మత్స్యకార గ్రామాలతో పాటు ప్రధాన మార్కెట్ల వద్ద జాలర్లకు ప్రజలకు ఈ చేపపై అవగాహన కల్పించాం. ఈ చేప పట్ల మత్స్యకారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి వాటిని వేటాడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఒకవేళ ఈ చేపలు వలలో పడినట్లయితే వలలను ధ్వంసం చేసి సముద్రంలో వదిలి పెట్టేలా అవగాహన కల్పిస్తున్నాం. ధ్వంసమైన వలలకు సంబంధించి ప్రభుత్వం నష్టపరిహారం కూడా అందిస్తుంది. పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో ఉపకరించే బొక్కు సారలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

– ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, ఫారెస్ట్ రేంజర్, కోరింగ అభయారణ్యం



బొక్కు సార నమూనాతో జాలర్లకు అవగాహన కల్పిస్తున్న అటవీ సిబ్బంది



బొక్కుసార వారోత్సవాలలో భాగంగా మత్స్యకార గ్రామాలలో గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



కోరింగా అభయారణ్యంలో విద్యార్థులకు బొక్కు సారపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బరువులెత్తారు...పతకాలు పట్టారు



అమలాపురంలో ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బరువులెత్తుతున్న లిఫ్టర్



నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సురేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు

- అమలాపురంలో ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీలు
- 200 మంది క్రీడాకారుల హాజరు

అమలాపురం టౌన్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ ప్రాంగణంలో 4వ యునైటెడ్ ఈస్ట్ అండ్ వెస్ట్ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీలు శుక్రవారం ఉదయం ప్రారంభమయ్యాయి. పోటీలకు ఉభయ గోదావరి జిల్లాల నుంచి 200 మంది పవర్ లిఫ్టర్లు హాజరై బరువులెత్తి సత్తా చాటారు. కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు పోటీలను ప్రారంభించారు. అంతకు ముందు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పీఎస్ సురేష్‌కుమార్‌ను సత్కరించి క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పప్పుల శ్రీరామ చంద్రమూర్తి, కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో పోటీలు జరిగాయి. సబ్ జూనియర్, మాస్టర్స్ (పురుషులు, మహిళలు) విభాగాల్లో 30 కేటగిరీల్లో పోటీలను నిర్వహించారు. విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లు, ఒలింపిక్ పతకాలు, చాంపియన్ షిప్ ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు. బెంచ్ ప్రెస్ విధానంలో పోటీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్‌కు అనుబంధంగా డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు ఉత్కంఠగా జరిగాయి. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా డి.సత్యనారాయణ, ఎంవీ సముద్రం, వి.నరేష్, డీఆర్‌కే నాగేశ్వరరావు, డి.గణేష్‌బాబు, బి.జోసఫ్, ఎస్‌కే వలీ సాహెబ్ వ్యవహరించారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, అమలాపురం వైస్ ఎంపీపీ అడపా వెంకట సుబ్రహ్మణ్యం, ఒలింపిక్ అసోసియేషన్ సభ్యుడు కల్వకొలను బాబు, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు రవణం వేణుగోపాలరావు పాల్గొన్నారు.

కొట్లాట కేసులో వ్యక్తికి ఏడాది జైలు

కె.గంగవరం: మోటారు సైకిల్ విషయంలో తలెత్తిన ఘర్షణ కేసులో ఒక వ్యక్తికి ఏడాది జైలు శిక్ష పడింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కుడుపూరు గ్రామంలో ఎదురెదురుగా నివసిస్తున్న పోలిశెట్టి వెంకటరమణ, కనకాల వీరబాబు గత ఏడాది జూన్ నాలుగో తేదీన మోటారు సైకిల్ విషయంలో ఘర్షణపడ్డారు. పోలిశెట్టి వెంకట రమణ కుమారుడు మనోహర్ ఈ తగవు విషయమై కనకాల వీరబాబు వద్దకు వెళ్లారు. ఆ సమయంలో ఇరువురి మధ్య ఘర్షణ జరిగి వెంకటరమణపై వీరబాబు కర్రతో దాడి చేసి గాయపరిచాడు. దీనిపై వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కె.గంగవరం పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. ఎస్సై జానీ బాషా కోర్టులో అభియోగపత్రం దాఖలు చేయగా కేసును విచారించిన రామచంద్రపురం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శారద శుక్రవారం నిందితుడు వీరబాబుకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసును ఏపీపీ రామ తులసి వాదించారు.

నకిలీ బంగారంతో మోసం చేసిన వ్యక్తుల అరెస్టు

సామర్లకోట: నకిలీ బంగారంతో బ్యాంకు వద్ద రుణం తీసుకుని మోసం చేసిన వ్యక్తులను సామర్లకోట పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐ ఎ కృష్ణభగవాన్ విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక రథంసెంటర్‌లోని బ్యాంకు ఆఫ్ ఇండియాలో రెండు కేజీల నకిలీ బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి రూ.94 లక్షలు అప్పు తీసుకున్న నిందితులను అరెస్టు చేశారు.


బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టిన నముందూరి ఫణీంద్రవిజయ సాగర్‌తో పాటు బంగారు ఆభరణాలను పరీక్షించే కేవీ భాస్కర్, నడిపూడి రామాచార్యులను అరెస్టు చేసినట్టు తెలిపారు. వీరితో మరో 10 మంది ఉన్నారని, వారు పరారీలో ఉన్నట్లు తెలిపారు. బ్యాంకు ఆఫ్ ఇండియా అధికారులు తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలను పరిశీలించే క్రమంలో ఈ నకిలీ ఆభరణాలను గుర్తించినట్లు తెలిసింది. ఈ మేరకు బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితులను శనివారం కోర్టుకు హాజరు పరచనున్నట్టు సీఐ తెలిపారు.

ఈటీసీలో కొనసాగుతున్న శిక్షణ

- ఎంపీడీఓలకు ముగిసిన తరగతులు
- సర్టిఫికెట్ల అందజేత

సామర్లకోట: దేశ ప్రగతికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన కీలకమని విస్తరణ శిక్షణ కేంద్రం(ఈటీసీ) వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ అన్నారు. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు ఉన్న 11 జిల్లాల్లోని ఎంపీడీఓలకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదరికం లేని గ్రామం, ఆరోగ్యకరమైన గ్రామం, పిల్లల స్నేహపూర్వక గ్రామం, నీటి సమృద్ధి గ్రామం, పరిశుభ్రమైన హరిత గ్రామం, స్వయం సమృద్ధితో మౌలిక సదుపాయాలు గల గ్రామం, సామాజిక భద్రత కలిగిన గ్రామం, సుపరిపాలన కలిగిన గ్రామం, మహిళా స్నేహపూర్వక గ్రామం అనే అంశాల ప్రాతిపదికన శిక్షణ ఇస్తోందన్నారు. శిక్షణ పొందిన అధికారులు మండల స్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చి గ్రామాలల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు అమలు జరిగేలా చూడాలన్నారు. ఈ మేరకు ప్రతి గ్రామంలోని గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసి అందరికీ కనిపించేలా నోటీసు బోర్డులో ఏర్పాటు చేయాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అంశాలపై రాత పరీక్ష నిర్వహించి, శిక్షణపై అభిప్రాయాలను సేకరించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీలు ఎస్ఎస్ శర్మ, ఎం.చక్రపాణిరావు, ఎ.రవిశంకర్, పి.రామకృష్ణ, వి.జగన్నాథం, ఎం.రాజీకుమార్, డి.శ్రీనివాసరావు, కేఆర్ నిహారికలు పాల్గొన్నారు. అలాగే 11 జిల్లాల్లోని పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారం ముగియనున్నాయి.

రత్నగిరికి మూడు హెచ్‌వీఎల్‌ఎస్ ఫ్యాన్ల సమర్పణ



సత్యదేవుని వార్షిక కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన హెచ్‌వీఎల్‌ఎస్ ఫ్యాన్‌లు

అన్నవరం: రత్నగిరి దేవస్థానానికి పెద్దాపురానికి చెందిన శ్రీలలితా రైస్ ఇండస్ట్రీ ఎండీ మట్టే సత్యప్రసాద్, సూర్యకమల దంపతులు రూ.ఆరు లక్షల విలువైన మూడు హెచ్‌వీఎల్‌ఎస్ (హై వాల్యూమ్ లో స్పీడ్) ఫ్యాన్లను శుక్రవారం అందచేశారు. వీటిలో రెండింటిని స్వామివారి వార్షిక కల్యాణమండపంలో అమర్చారు. మరో ఫ్యాన్‌ను షాపింగ్ కాంప్లెక్స్ ముందు గల మండపంలో ఏర్పాటు చేయనున్నారు. ఏడు మీటర్ల వ్యాసం కలిగిన ఈ ఫ్యాన్లను హెలికాప్టర్ ఫ్యాన్లుగా పిలుస్తుంటారు. ఈ ఫ్యాన్ గాలి సుమారు 20 అడుగుల వరకు వ్యాపిస్తుంది.

అంతర్జాతీయ సమావేశాలకు నిర్కా డైరెక్టర్ మాగంటి



డాక్టర్ శేషుమాధవ్‌ను అభినందిస్తున్న నిర్కా శాస్త్రవేత్తలు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఐసీఏఆర్ – జాతీయ వాణిజ్య పరిశోధన సంస్థ (నిర్కా) డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ స్వీడన్ స్టాక్‌హోమ్‌లో పొగాకు ఉత్పత్తులపై జరిగే సమావేశానికి హాజరుకానున్నారు. సెప్టెంబరు 2 నుంచి 5వ తేదీ వరకు జరిగే ఈ అంతర్జాతీయ సమావేశాలలో ఐఎస్‌వో/టీసీ–126లో పాల్గొనే భారత బృందంలో ఆయన ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ పర్యటన ప్రధానం పొగాకు, పొగాకు ఉత్పత్తులకు సంబంధించిన అంతర్జాతీయ ప్రామాణీకరణ ప్రక్రియలలో భారతదేశం క్రియాశీల పాత్రను బలోపేతం చేయడమే లక్ష్యంగా సాగుతోందని ఆయన తెలిపారు. పొగాకులో పరీక్షా పద్ధతులు, భద్రతా ప్రమాణాలు, నాణ్యతకు సంబంధించి కొత్త అంతర్జాతీయ ప్రమాణాల అభివృద్ధి, సవరణపై ఆయన అభిప్రాయాలను వ్యక్తపరచనున్నారు. పొగాకు ఉత్పత్తుల పరీక్షలకు సంబంధించిన అంతర్జాతీయ ప్రమాణాల పద్ధతి శీల సమీక్షలో పాల్గొని, అభివృద్ధి చెందుతున్న భారత జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా కృషి చేయనున్నారు. అదే విధంగా వివిధ అంతర్జాతీయ సంస్థలు, ప్రయాణీకరణ సంస్థ సమర్పించే సాంకేతిక నివేదికలు, స్థితిగతుల పత్రాలను సమీక్షించి, భారతదేశం గ్లోబల్ ప్రమాణాల అభివృద్ధిలో మాధవ్ కీలకపాత్ర పోషించనున్నారు. ఈ మేరకు శుక్రవారం స్వీడన్‌కు బయలుదేరనున్న ఆయనను నిర్కా శాస్త్రవేత్తల బృందం పుష్పగుచ్ఛంతో అభినందించింది.

పాఠశాలలో మత ప్రచారంపై ఆందోళన

- పై అంతస్తులో చర్చిని తొలగించాలని డిమాండ్
- పోలీసుల హామీతో ఆందోళన విరమణ



కోరుమిల్లిలో ఆందోళనకారులతో చర్చిస్తున్న డీఎస్పీ రఘువీర్ తదితరులు

కపిలేశ్వరపురం: మండలంలోని కోరుమిల్లిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో మత ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ గ్రామస్తులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. పెద్ద సంఖ్యలో నినాదాలు చేస్తూ గోదావరి గట్టు వంతెన నుంచి గ్రామ వీధుల మీదుగా పంచాయతీ కార్యాలయం వరకూ ర్యాలీ చేశారు. విషయం తెలుసుకున్న రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ పరిస్థితిని సమీక్షించారు. సమస్య మూలాల పైనా, గ్రామంలోని శాంతి భద్రతలపైనా ట్రైనీ డీఎస్పీ పి.ప్రదీప్తి, మండపేట రూరల్ సీఐ పి.దొరరాజులతో చర్చించారు. ఆందోళనకు కాకినాడకు చెందిన హైందవ పరిరక్షణ సమితి నాయకులు మద్దతు పలికారు. సమితి నాయకులు సీహెచ్ గవరయ్య, కె.తులసి మాట్లాడుతూ పిల్లలకు విజ్ఞానాన్ని పంచాల్సిన పాఠశాలలో మత ప్రచారం చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. పాఠశాలపై అంతస్తులో చర్చి నిర్వహించడంపై పంచాయతీ, విద్యా శాఖాధికారులు చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహిస్తున్నారని ఆరోపించారు. వెంటనే పాఠశాల నుంచి చర్చిని వేరు చేసే చర్యలు ప్రారంభించాలని లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి కామేశ్వరరావు మాట్లాడుతూ చర్చి నిర్వహణకు ఉన్న పత్రాలతో వారం రోజుల్లో హాజరుకావాలంటూ నోటీసు జారీ చేస్తానని, ఆ లోగా సమాధానం రానిపక్షం ఉన్నతాధికారులకు సమస్యను నివేదిస్తానని హామీ ఇచ్చారు. దాంతో ఆందోళనకారులు సంతృప్తి చెంది ఆందోళనను విరమించారు. అంగర ఎస్సై హరీష్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.

మృతదేహం లభ్యం

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకకు చెందిన పల్లి చిట్టియ్య (65) మృతదేహాన్ని శుక్రవారం పోలీసులు గుర్తించారు. గురువారం ఉదయం గోదావరి నదీ తొగరపాయలో అతడు గల్లంతైన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులకు చిట్టియ్య మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై హరీష్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరప: తాను ప్రేమిస్తున్న యువతిని మర్చిపోమని, మరచిపోకపోతే అంతు చూస్తానని బెదిరించడంతో, ఏంచేయాలో తెలియక ఒక యువకుడు గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కరపలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం మేరకు గ్రామానికి చెందిన పేపకాయల నారాయణమూర్తి కుమారుడు వాసు (29) కాకినాడలోని ఒక జ్యువెలర్స్‌లో రెండేళ్లుగా సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అదే షాపులో పనిచేస్తున్న ఒక అమ్మాయిని ఏడాదిగా ప్రేమిస్తున్నాడు. ఈ నెల 27వ తేదీన రాత్రి ఈత రామకృష్ణ అనే వ్యక్తి వాసుకు ఫోన్‌చేసి నువ్వు ప్రేమిస్తున్న అమ్మాయిని మరచిపోమని, లేకపోతే నీఅంతు చూస్తానని బెదిరించాడు. దీంతో ఏం చేయాలో తెలియక వాసు 28వ తేదీ ఉదయం 8 గంటలకు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న తండ్రి నారాయణమూర్తి వెంటనే చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడ చికిత్సపొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని ఆత్మహత్య

తాళ్లపూడి: మండలంలోని తిరుగుడుమెట్టలో ఒక వ్యక్తి శుక్రవారం ఉరి వేసుకొని మృతి చెందాడు. ఎస్సై టి.రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన సైదు సాయి (26) భార్య కొన్నాళ్ల క్రితం కుటుంబ కలహాల నేపథ్యంలో మృతి చెందింది. దీంతో మనస్తాపానికి గురై గ్రామ శివారులోని వేప చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయికి ఆరేళ్ల క్రితం వివాహం కాగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఇస్త్రీపెట్టె షాక్ కొట్టి ...

కాట్రేనికోన: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కొప్పిగుంట గ్రామానికి చెందిన కొప్పిశెట్టి శ్రీనివాసరావు బట్టలు ఇస్త్రీ చేస్తుండగా ఇస్త్రీ పెట్టె షాక్ కొట్టి మృతి చెందాడు. హైదరాబాద్‌కు వెళ్లే ప్రైవేటు బస్సులో తాత్కాలిక ఉద్యోగం చేస్తున్న శ్రీనివాసరావు విధులకు వెళ్లేందుకు బట్టలు ఇస్త్రీ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. శ్రీనివాసరావుకు తల్లి దండ్రులతో పాటు అక్కా, చెల్లి ఉన్నారు. కుటుంబ పోషణ కోసం కష్టపడుతున్న కుమారుడి అకాల మృతిని తల్లిదండ్రులు జీర్ణించుకోలేక పోతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ముమ్మిడివరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.